# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-10-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన, ఆత్మనిర్భరత మిషన్ పథకాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఢిల్లీలో ప్రారంభించారు.**

2. **మానసిక పరిపక్వత రావాలంటే పుస్తకాలు చదవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే. పవన్ కల్యాణ్ సూచించారు.**

3. **గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.**

4. **కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు తో అన్ని వర్గాలకు ప్రయోజనం కలుగుతోందని పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్ పేర్కొన్నారు.**

==========================

కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం 42 వేల కోట్ల రూపాయలతో రూపొందించిన ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన, ఆత్మనిర్భరత మిషన్ పథకాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ఢిల్లీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని, రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొచ్చిందని ప్రధానమంత్రి వివరిస్తూ..

( వాయిస్ 35 )

కాగా ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకంలో దేశవ్యాప్తంగా వంద జిల్లాలను ఎంపిక చేయగా, రాష్ట్రంలో శ్రీ సత్యసాయి, అనంతపురం, అల్లూరి సీతారామరాజు, అన్నమయ్య జిల్లాలు ఉన్నాయి.

--------------------------

కార్పొరేట్ వైద్య సేవలను పేద ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గు మళ్ల ప్రసాదరావు తెలిపారు. చిత్తూరు పీ.వీ.కె.ఎన్.కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. అనంతరం పార్లమెంట్ సభ్యులు పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ శిబిరంలో అన్ని వైద్య పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు, మందులు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇలాంటి శిబిరం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

---------------------------

మానసిక పరిపక్వత రావాలంటే పుస్తకాలు చదవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే. పవన్ కల్యాణ్ అన్నారు. ఐక్య రాజ్య సమితి పూర్వ సహాయ సెక్రటరీ జనరల్ లక్ష్మీ మురుడేశ్వర్ పురి రచించిన 'ఆమె సూర్యుడిని కబళించింది' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పవన్‌కల్యాణ్ పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒక్కో పుస్తకం చదువుతుంటే ఎన్నో అంశాలు నేర్చుకుంటాం అని ఉప ముఖ్యమంత్రి తెలుపుతూ..

వాయిస్...25 సెకన్స్

---------------------------

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.బాపట్ల జిల్లా కొండమంజులూరులో ఆయన ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లను మంత్రి పరిశీలించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 356 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. పాఠశాలలో డ్రాప్ అవుట్ లేకుండా చేసేందుకే విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసినట్లు చెప్పారు.

---------------------------

జీఎస్టీ -2.0 సంస్కరణల వల్ల తగ్గిన పన్నుల లబ్ధిని రాష్ట్రంలోని ప్రతి కుటుంబం పొందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని ఆటోనగర్ లో 'సూపర్ జీఎస్టీ...సూపర్ సేవింగ్స్' పేరుతో జీఎస్టీ-2.0 సంస్కరణల వల్ల తగ్గిన ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రదర్శన, అమ్మకాల ఎగ్జిబిషన్ ను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సంస్కరణలపై ప్రజలకు అవగాహన కోసం రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల పాటు సదస్సులు నిర్వహిస్తున్నట్లు శాసనసభ్యులు గద్దే రామ్మోహన్ తెలిపారు. మరో వైపు నందిగామలో శాసనసభ్యులు తంగిరాల సౌమ్య 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్' న ప్రారంభించారు.

---------------------------

రాష్ట్రంలో మానసిక వ్యాధుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగించే విషయమని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. విజయవాడలో నిర్వహించిన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని 10 ప్రధాన వ్యాధుల్లో మానసిక వ్యాధిని కూడా చేర్చినట్లు తెలిపారు. సమాజానికి మానసిక వైధ్యులు సేవలు ప్రశంసనీయమని మంత్రి సత్యకుమార్ కొనియాడుతూ..

- వాయిస్ 26

---------------------------

ఆర్.ఎస్.ఎస్ అనుబంధ సేవా విభాగాల్లో ఒకటిగా విశాఖపట్నంలో ఉన్న వివేకానంద మెడికల్ ట్రస్ట్ వారి వివేకానంద డయాగ్నోస్టిక్స్ ఊ రీసెర్చ్ సెంటర్ అత్యాధునిక ఆసుపత్రి భవనాన్ని ఆర్.ఎస్.ఎస్ సర్కార్యవాహ దత్తాత్రేయ హొసబలే ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిస్వార్థంగా సేవలందించే సంస్థలే నేటి సమాజానికి అవసరమని చెప్పారు. ఆర్.ఎస్.ఎస్ ఆశయం కేవలం చారిటీ కాదని, సమాజానికి

తిరిగి ఇవ్వగలిగే మానవ వనరులను తయారు చేయడమని పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు, పారదర్శక పన్ను విధానంతో అన్ని వర్గాలకు ప్రయోజనం కలిగిందని పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్ అన్నారు. కృష్ణాజిల్లా ఉయ్యూరులో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ఎలక్ట్రానిక్స్ ఉత్సవ్ ఎగ్జిబిషన్ ను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ.. వారం రోజుల పాటు ఈ ప్రదర్శన కొనసాగుతుందని, ప్రజలు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. నిత్యావసర వస్తువులు ధరలపై జీఎస్టి పన్ను శాతం తగ్గించడం వల్ల ప్రతి కుటుంబానికి 5 వేల రూపాయలు కలిసి వచ్చే విధంగా ఉందని శాసనసభ్యులు బోడే ప్రసాద్ తెలుపుతూ..

- వాయిస్ 28

---------------------------

బాలికలకు వచ్చే అనారోగ్య సమస్యలను పరిష్కరించేందుకు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని తిరుపతి మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి శాంతిదుర్గ అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ బాలికల ప్రభుత్వపాఠశాలలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికల హక్కుల, బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి వాటి పై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.

---------------------------

ఉత్తర ఆంధ్ర, దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి సగటున 0.9 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతి లో ని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో.. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రానున్న రెండు రోజులపాటు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ..

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ఢిల్లీలోని అరుణ్ జేట్లీ స్టేడియంలో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య క్రికెట్ రెండవ టెస్ట్ జరుగుతోంది. తొలి ఇన్నింగ్స్ లో భాగంగా నిన్న మొదటి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ జట్టు 2 వికెట్ల నష్టానికి 318 పరుగులు చేసింది.

ఆటకు రెండో రోజైన ఈ రోజు ఆట భోజన విరామ సమయానికి 506 పరుగులు చేసి 4 వికెట్ల నష్టపోయింది. గిల్ 122 పరుగులు, ధ్రువ్ జురెల్ 41 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు.

======================